# ఎంతెంత దూరం

**నిర్మలారాణి**



SECRETARY
POSTAL RECREA... CLUB
O/o. POSTMASTER...

గుమ్మంలోనే ఎదురయింది అమ్మ.

''ఇంత లేటుగానా రావడం?'' గద్దించినట్టు అడిగింది.

అమ్మ దగ్గర జండూబామ్ వాసన తీవ్రంగా వస్తోంది.

నేనేం మాట్లాడకుండా చెప్పులు గూట్లో విడిచి, లోపలకు వెళ్లాను. చిన్న తమ్ముళ్లిద్దరూ ట్యూబ్‌లైటు వెలుతురులో హోంవర్కు కాబోలు రాసుకుంటున్నారు. పెద్దవాడు రవి కనిపించలేదు.


''రవి రాలేదా?'' అడిగాను మామూలుగానే.

అమ్మ ఇంతఎత్తున లేచింది నామీదకు.

''వాడితో పంతమా? వాడు ఇంటికి వస్తేగాని నువ్వు రావా? వాడు మగపిల్లవాడు, ఎప్పుడైనా వస్తాడు. ఆడపిల్లవి ఈ తిరుగుళ్ళేమిటి? దీపం పెట్టకముందే ఇల్లు చేరాలని ఎన్నిసార్లు చెప్పాను? చదివిన చదువు చాలుగాని వంటచేసి తగలడు. పొద్దున్నుంచి తలనొప్పితో చస్తున్నా'' అంటూ తలపట్టుకుని మంచంమీద పడుకుంది.

నాకు చెప్పలేనంత కోపం వచ్చింది. బుద్ధిగా ఎమ్‌సెట్ కోచింగ్ క్లాస్‌కి వెళ్ళివస్తుంటే ఎక్కడో తిరిగి వచ్చినట్టు మాట్లాడుతుంది. పైగా ఆడామగా అంటూ విభజించి మాట్లాడటం చిరాకు తెప్పించాయి. అమ్మ ఎప్పుడూ ఇంతే. నాన్న అమ్మకి తాళం వేస్తాడు. ఇంకెప్పుడైనా అయితే వంటగింట చేసేది లేదని కాసేపైనా వాదించేదాన్ని, అమ్మ పరిస్థితి చూసి ఏం మాట్లాడకుండా గూట్లో పుస్తకాలు పడేసి వంటింట్లోకి వెళ్లాను.

వంటిల్లంతా, అక్కడ ఒక్కక్షణం కూడా నిలబడలేనంత గలీజుగా వుంది. పప్పుగిన్నె, అన్నంగిన్నెల మీద మూతలు లేకుండా ఈగలు ముసురుతున్నాయి. మధ్యాహ్నం అనగా తిని వదిలిన ఎంగిలి ప్లేట్లు ఎండి పడివున్నాయి. ప్లేట్ల చుట్టూ నమిలి వదిలేసిన మునక్కాడ తొక్కలు అసహ్యంగా, చీదర కలిగిస్తున్నాయి. మూడు ప్లేట్లే వున్నాయి అంటే చిన్నతమ్ముళ్ళిద్దరు, నాన్న తిన్నారన్నమాట. రవి మధ్యాహ్నం భోజనానికి వచ్చినట్టు లేడు. వాడికోసం చూసి, చూసి అమ్మకూడా తినివుండదు. అందుకే తలనొప్పి ఆమెకు. అమ్మ అన్నం తినలేదన్న ఆలోచనకంటే, పొద్దున్న అనగా ఇల్లు విడిచినవాడు ఇంకా ఇంటికి రాకపోయినా ''వాడు మగపిల్లవాడు'' అంటూ వెనకేసుకురావడం నాకు బాధ కలిగిస్తోంది. పైగా, ఎప్పుడూ ''నువ్వు ఆడపిల్లవి'' అంటూ తమ్ముళ్ళ ముందే నన్ను తక్కువ



## పరువు నిలిపిన 'ముత్యాలముగ్గు'

తెలుగులో ప్రతి సంవత్సరమూ ఏదో ఒక చిత్రం ప్రాంతీయ బహుమతి పొందుతూనే వుండేది. అయితే 1974, 1975 సంవత్సరాల్లో తెలుగు చిత్రాలలో ఒక్క చిత్రమూ జాతీయ బహుమతికి నోచుకోలేదు. చివరికి 1976లో బాపు 'ముత్యాలముగ్గు' ఉత్తమ తెలుగు చిత్రంగా జాతీయ బహుమతి గెలుచుకోవడంతో తెలుగు చిత్రాలు మళ్ళీ పూర్వ ప్రతిష్ఠను సంపాదించుకోగలిగాయి. ఇలా తెలుగు చిత్రాల పరువు నిలిపిన చిత్రంగా 'ముత్యాలముగ్గు' నిలిచింది.

చేసి మాట్లాడుతుంది. నాన్న కూడా అంతే. ఇవి ఆడపిల్లల పనులు అంటూ ఇంటి పనంతా నాతో, అమ్మతో చేయిస్తాడు. ఇల్లంతా ఇంత గలీజుగా ఉంచకుండా తమ్ముళ్ళతో శుభ్రం చేయించి వుండొచ్చుగా. చేయలేనంత కూనలేం కాదు. తమ సంతానంలోనే వివక్ష చూపించడం ఎంత అన్యాయం! అమ్మాయయినా, అబ్బాయి అయినా ఒకే మంచి చెడ్డలు, ఒకే బాధ్యతలు నేర్పించకపోవడం తల్లిదండ్రుల తప్పు కాదా? మగపిల్లవాడు 'అధికుడు' అన్న ఆలోచన తమ్ముళ్ళకి నూరిపోస్తున్నది అమ్మా నాన్నే. ఇంక పొరకపట్టుకొమ్మంటే మాటెందుకు వింటారు?

అయిష్టంగానే వంటిల్లంతా శుభ్రంచేసి, గిన్నెలు కడిగి అన్నానికి పెట్టాను. తొమ్మిదవుతుండగా నాన్న వచ్చాడు. అందరూ అన్నాలు తిని పడకలు వేశారు.

''రవి రాలేదు నాన్నా'' నిద్రకుపక్రమిస్తున్న నాన్నతో అన్నాను.

''ఆ వస్తాడ్లే, ఫ్రెండ్స్‌తో సినిమాకెళ్ళుంటాడు'' పడుకున్న రెండు నిమిషాలకే గురక మొదలు పెట్టాడు నాన్న.

***

''కోచింగ్ మానేస్తున్నాను'' అంది రాధిక.

నా ప్రక్కనే బాంబు పేలినంతగా అదిరిపడ్డాను. ఒక్కక్షణం రాధిక ఏమంటున్నదో అర్థం కాలేదు.

నేనూ, రాధిక ఒకే కాలేజ్‌లో ఇంటర్ చదువుతున్నాం. ఇద్దరికీ ఇంజనీర్లు కావాలని ఆశ. ఆడపిల్ల చదువుల మీద వేలకువేలు 'తగలేసే' పరిస్థితి ఇద్దరిళ్ళలో లేకున్నా, ఉన్న ఊర్లోనే ఫ్రీ సీటు వస్తే కాదనరేమోనన్న ఆశతో కష్టపడి, శ్రద్ధగా చదువుతున్నాం. ఇంక రెండు నెలల్లోనే పరీక్షలు.

''కోచింగ్ మానేస్తున్నావా? ఎందుకు?'' ఆదుర్దాగా అడిగాను.

జవాబుగా రాధిక కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

అది చూసి నా ఆందోళన మరింత ఎక్కువైంది.

''ఏం జరిగిందే, ఏమయింది?'' అన్నాను ఆత్రంగా.

''..... ఆరోజు కోచింగ్ క్లాస్ నుండి ఇంటికి వెళ్తుంటే వేణు, వాడి ఫ్రెండ్స్ వెంటపడి ఏడిపించారని చెప్పాను, గుర్తుందా'' అంది కన్నీళ్ళ మధ్య.

''ఆ, గుర్తులేకేం. బాగా బుద్ధి చెప్పాను, పోలీస్ రిపోర్టు ఇస్తానని బెదిరించానన్నావుగా'' అన్నాను.

''ఆ మాట అన్నందుకే, వాడి ముఠాని వెంటేసుకుని ఇంటిమీదకొచ్చి నానా మాటలు అన్నాడు. నా అంతు చూస్తాడట. దిక్కున్నచోట చెప్పుకోమన్నాడు'' అంది కాసింత భయంగా. రాధిక భయానికి అర్థం లేకపోలేదు. వేణు ఏ కాలేజీ స్టూడెంటూ కాదు. ఏ ఆఫీసులోనూ పనిచెయ్యడు. కాని అన్ని కాలేజీల దగ్గర, ఆఫీసుల దగ్గర అమ్మాయిల్ని ఏడిపిస్తూ అల్లరిచిల్లరగా తిరగడం వాడి పని. వాడికి ఓ ముఠా నాయకుడి అండదండలున్నాయంటారు. అందుకే వాడి జోలికి ఎవరూ పోరు. పోలీసులు అంటీ అంటనట్టు రిపోర్టులు నమోదు చేయరు.

''వాళ్ళ ఇల్లు మీ ఇంటి దగ్గరే కదా, వాళ్ళ పెద్దవాళ్ళకి చెప్పి ఉండాల్సింది'' అన్నాను ఆలోచిస్తూ.

''అదీ అయింది. నాన్న వెళ్ళి చెప్తే, 'మా పిల్లవాడొక్కడేనా మీ అమ్మాయిని ఏడిపించేది' అందట. మగపిల్లలన్న తర్వాత ఏదోఒకటి అంటూ వుంటారట, మనం వినీ విననట్టు వెళ్తుండాలట'' అంది ఉక్రోషంగా.

ఈ పెద్దవాళ్ళకు ఆ మాత్రం ఇంగితం ఎందుకుండదోననిపించింది నాకు. పిల్లలు తప్పు చేసినప్పుడు బుద్ధి చెప్పి మందలించాల్సింది పోయి వాళ్ళని వెనకేసుకురావడం ఎంత సిగ్గుచేటు!

''అమ్మ కూడా నాదే తప్పంటోంది. ఇంకోసారి ఇట్లా జరిగితే కాలేజీ కూడా మాన్పిస్తాడట నాన్న. సంబంధాలు చూస్తాడట. పెళ్ళి చేస్తాడట... ప్చ్, నిజమే, నేనారోజు నోరు మూసుకుని వెళ్ళివుంటే ఏ గొడవా వుండేది కాదేమో!'' రాధిక అట్లా బేలగా అంటుంటే నాకు చెడ్డ చిరాకనిపించింది.

''చాల్లేవే, నోరుముయ్యి. అయినా వాడెవడో వెంటపడి వేధిస్తుంటే వాడికి బుద్ధి ఎట్లా చెప్పాల్నో ఆలోచించడం మాని, నిన్ను కాలేజీ మానెయ్, కోచింగ్ మానెయ్ అంటారేమిటి? ఎవడేమన్నా నోరు మూసుకుని, చెవులు మూసుకుని వెళ్ళాల్సిందేనా మనం'' కాస్త కోపంగానే అన్నాను.

రాధిక మాట్లాడలేదు. అనవసరంగా రాధిక మీద కోప్పడ్డానేమో అనిపించింది.

చాలా అనునయంగా చెప్పాను. ''నువ్వారోజు చాలా మంచిపని చేశావే రాధీ! మనం ఎదురు తిరక్కపోతే అమ్మాయిల్ని ఏడిపించడం వాళ్ళ హక్కనుకుంటారు, తెలుసా? మనం నోరు మూసుకుని వెళ్తుంటే, ఇంకా ధైర్యంతో ఇంకా దౌర్జన్యం చేస్తారు మనమీద. నువ్వేం దిగులుపడకు. మహిళా సంఘం వాళ్ళతో మాట్లాడతాను. అందరం కలిసి వేణుతో నీకు 'సారీ' చెప్పిస్తాం చూడు'' అంటూ ధైర్యం చెప్పాను.

''ఏ 'సారీ' వద్దు తల్లీ. నా జోలికి రాకుండా, నా చదువు నన్ను చదవనిస్తే చాలు'' అంది. ఇద్దరం కాలేజీ కాంపస్ దాటి రోడ్డుమీదకు వచ్చాం. రాధిక ఇంటివైపు వెళ్ళే, నేను మహిళా సంఘం ఆఫీసు వైపు దారితీశాను.

నడుస్తున్నానన్నమాటే గాని నా ఆలోచనలు రాధిక చుట్టూ తిరుగుతున్నాయి. 'పాపం, చాలా డిస్టర్బ్ అయింది. అసలు, వాడేమంటాడో, వీడేం చేస్తాడోనని భయపడి ఆడపిల్లల్ని చదువు మాని పించడం, పెళ్ళే సమస్యలకు పరిష్కారం అనుకోవడం ఎంత అమానుషం? ఆడపిల్లకు సమాజం ఇచ్చే భద్రత ఏదీ? స్త్రీలు సమాజంలో సగభాగం అంటూనే స్త్రీల సమస్యలు మాత్రం వ్యక్తిగతం అన్నట్టు ఒక్కరూ అండగా నిలవరేం? అయినా ఈ మగపిల్లలెందుకింత అమానుషంగా ప్రవర్తిస్తారు? సరైన కుటుంబ వ్యవస్థ లేకపోబట్టే కదా!' ఆలోచనల్లో కొట్టుకుపోతూ 'బాయ్' మంటూ కారు హారన్ విని ఉలిక్కిపడ్డాను. చూద్దునుకదా, నా చుట్టూ ట్రాఫిక్ ఎక్కడికక్కడ నిలబడిపోయి వుంది. అల్లంత దూరంలో జనం, గుంపులు గుంపులుగా, ఒకరిని తోసుకుంటూ దేన్నో వింతగా చూస్తున్నారు.

''ఆళ్ళేనంట, అమద్దెన రెండో ఆట సినిమా చూసి వస్తున్న ఆడకూతురి మీద అగాయిత్యం చేసినోళ్ళు'' అంటున్నారెవరో.

''మక్కెలిరగ్గొట్టాల, ఏకీలుకాకీలు ఇరగదీస్తే గాని బుద్ధిరాదు''.

''కఠినంగా శిక్షించాలండీ. ఊరకే వదిలెయ్యకూడదు. లేడీస్‌కి సెక్యూరిటీ లేకుండా పోతోంది.''

అక్కడి వాళ్ళంతా ఒక్కటిగా స్పందించడం నాకు సంతోషంగా వుంది. 'అవును, ఇలాంటివాళ్ళకు బాగా శిక్ష పడితేగాని ఎవరూ ఆడవాళ్ళ జోలికి వెళ్ళరు' అనుకుంటూ అక్కడే కాస్త ఎత్తులో వున్న షాప్ మెట్లు ఎక్కాను అక్కడ ఏం జరుగుతుందో చూద్దామని. షాపు అంతా నాలాంటివాళ్ళతో కిటకిటలాడుతోంది. ఎట్లాగో కాస్త చోటుచేసుకుని, నా ముందు నిలబడ్డవాళ్ళలో నుంచి సందు చేసుకుని చూశాను ఉత్సాహంగా.

రోడ్డుమీద నలుగురు యువకుల్ని, కేవలం కట్‌డ్రాయరుతో అర్ధనగ్నంగా ఊరేగిస్తూ, లాఠీతో కొడుతున్నారు పోలీసులు.

కాస్త పరీక్షగా చూసి నా కళ్ళని నేనే నమ్మలేకపోయాను. ఆ నలుగురిలో ఒకడు, నా తమ్ముడు రవి.

★